క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధం


గ్రంథాలయ నూతన భవనం

దత్తిరాజేరు: మండల కేంద్రంలో శాఖా గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు గ్రంథాల య అధికారి రాజు తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని, సమస్య ను జిల్లా గ్రంథాలయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో, సొంత భవనం నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూ రు చేశారని చెప్పారు. ఈ నిధులతో అన్ని సదుపాయాలతో భవనం నిర్మిం చామని, త్వరలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించ నున్నారని ఆయన తెలిపారు. సొంత భవనం అందుబాటులోకి వస్తుండడంతో పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వీలుపర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటారని, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు రేపటి వరకు గడువు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. కోర్సులు, ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

జమిలీ ఎన్నికలతో సుపరిపాలన


మాట్లాడుతున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: దేశ వ్యాప్తంగా జమిలీ ఎన్నికలు నిర్వహించడం ద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందని బీజేపీ విజయనగరం పార్లమెంటు కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1967లో చివరి సారిగా జమిలీ ఎన్నికలు జరిగాయన్నారు. ఆ తరువాత కాలంలో జమిలీ ఎన్నికల నిర్వహణ కోసం చాలా సార్లు ప్రతిపాదనలు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో జమిలీ ఎన్నికలు జరుగాతయని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడంతో పరిపాలనకు అడ్డంకిగా మారుతోందని, అందుకనే దేశ వ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం మంచిదన్నారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు వంటి ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమిలీ ఎన్నికలు నిర్వహణ కోసం నిర్ణయం తీసుకుంటారన్నారు.

నేడు 'స్పందన'

మెరకముడిదాం/దత్తిరాజేరు/బొండపల్లి: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్నట్లు మెరకముడిదాం, దత్తిరాజేరు, బొండపల్లి ఎంపీడీఓలు ఎం.రత్నం, సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణారాయుడు స్వామి వారు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుదుపేట గ్రామంలోని శ్రీకృష్ణాలయంలో సోమవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బాలబాబు, మాజీ సర్పంచ్ పైడిబాబు, ఉప సర్పంచ్ రామకృష్ణ ఆదివారం తెలిపారు. నాలుగు రోజుల పాటు ఆలయంలో కృష్ణారాయుడు స్వామి వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 7వ తేదీన కృష్ణాష్టమి రోజున మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఉంటుంద ని, ఈసందర్భంగా చిన్నారుల బండ్ల వేషాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సిద్ధమవుతున్న గణనాథులు

- ఈనెల 18 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు
- విగ్రహాల తయారీలో బిజీగా కళాకారులు


ఎల్.కోట సమీపంలో విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు


రంగారాయపురం కేంద్రంలో తయారు చేస్తున్న భారీ వినాయక విగ్రహం


కొత్తవలస సమీపంలో విగ్రహాల తయారీ కేంద్రంలో రూపుదిద్దుకుంటున్న గణనాథులు

కొత్తవలస: వినాయక చవితి వేడుకలకు సమయం సమీపిస్తుండడంతో గణనాథుల విగ్రహాల తయారీలు ఊపందుకున్నాయి. మండపాల్లో కొలువు దీరి పూజలందుకునేందుకు గణనాథులు ముస్తాబవుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో నెల రోజుల ముందు నుంచే కళాకారులు విగ్రహాల తయారీ ప్రారంభించారు. ఈనెల 18న వినాయక చవితి కావడంతో విగ్రహాలకు తుదిమెరుగులు దిద్ది, రంగులు అద్దే పనుల్లో కళాకారులు బిజీబిజీగా ఉన్నారు. గతంలో రాజస్థాన్, కోల్‌కతా ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఈ ప్రాంతానికి వచ్చి స్థావరాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాలను తయారు చేసి విక్రయించే వారు. వారి వద్ద ఈ ప్రాంతానికి చెందిన చాలా మంది పని చేసే వారు. క్రమేణా వారంతా విగ్రహాల తయారీలో మెలకువలు నేర్చుకుని, ప్రస్తుతం వారే సొంతంగా విగ్రహాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో ఎస్. కోట, బొద్దాం, లక్కవరపుకోట, రంగారాయపురం, సంతపేట, కొత్తవలస, చింతలపాలెం, దేశపాత్రునిపాలెం తదితర జంక్షన్లలో సుమారు వంద కేంద్రాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ అవతారాలతో కూడిన విగ్రహాల అచ్చులను తెచ్చుకొని ప్రతిమలను తయారు చేస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ. 25 వేల వరకు విలువ చేసే విగ్రహాలను కళాత్మకంగా, అత్యంత సుందరంగా, శోభాయమానంగా తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలకు ఒడిశా రాష్ట్రానికి విగ్రహాలను ఎగుమతి చేస్తుంటారు.

వంద విగ్రహాలను తయారు చేశా..



హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు గతంలో నర్సీపట్నం సమీపంలో విగ్రహాలు తయారు చేసే వారు. వారి వద్ద చాలా కాలం పనిచేశా. విగ్రహాల తయారీలో 16 ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం మా గ్రామంలోనే సొంతంగా విగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాను. ఈ ఏడాది ఉత్సవాలకు ఇప్పటి వరకు వందకు పైగా ప్రతిమలను తయారు చేశాను. వాటికి రంగులు వేయాల్సి ఉంది.

– ఎస్.అప్పలరాజు, రంగరాయపురం, ఎల్.కోట మండలం

15 ఏళ్ల అనుభవం



విగ్రహాల తయారీలో 15 ఏళ్ల అనుభవం ఉంది. ఏటా ఈ ప్రాంతంలో విగ్రహాల తయారీ కేంద్రాల్లో రోజు కూలికి పనిచేస్తుంటాం. ఈ ఏడాది రంగరాయపురం వద్ద కేంద్రంలో ప్రతిమలను తయారు చేస్తున్నాం. కేంద్రం నిర్వాహకుడు రోజుకు రూ.450 కూలి ఇస్తున్నారు.

– ఎస్. బంగారయ్య, ఏ.మహేష్, అనకాపల్లి జిల్లా.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న త్రినాథమూర్తి, పెద్దలు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామ సమీపంలో వెదుళ్ల పైడితల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి వీరభద్రపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల త్రినాథమూర్తి దంపతులు, పెద్దలు ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రపురం, నరపాం, కర్రిచిన్నయ్యపాలెం, వియ్యంపేట, మునగపాకవానిపాలెం, గొల్లలపాలెం, కొటానివానిపాలెం గ్రామాలకు ఈ అమ్మవారు గ్రామదేవత. అమ్మవారి పండగను ఏటా ఈ ఏడు గ్రామాల వారు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఏడు గ్రామాల ప్రజలు రూ.70 లక్షలు చందా పోగుచేసి ఆలయ పునర్నిర్మాణానికి సిద్ధమయ్యారు. శంకుస్థాపన పూజుల్లో ఏడు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవాదృక్పథం కలిగి ఉండాలి


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీటీ రమేష్, సర్పంచ్ కొండలరావు

కొత్తవలస: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని, ప్రధానంగా యువత వీలైనంత ఎక్కువగా సేవా కార్యక్రమాల్లో భాగ స్వామ్యం కావాలని డిప్యూటీ తహసీల్దార్(డీటీ) టి.రమేష్ కోరారు. మండలంలోని తుమ్మికాపల్లికి చెందిన ఫర్ ది ఫీపుల్ చారిట బుల్ ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 39 మంది ఒంటరి మహిళలకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆది వారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన డీటీ మాట్లాడుతూ ఫర్ ది ఫీపుల్ చారిటబుల్ ట్రస్టు సేవలను కొని యాడారు. తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు మాట్లాడుతూ ట్రస్టు అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ట్రస్టు కార్యవర్గ సభ్యులు శ్రావణ్‌కుమార్, సంతోష్‌కుమార్, ధర్మ, గణేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత


గంట్యాడ: వృద్ధురాలు ఎల్లమ్మకు కేజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న పెదవేమలి వలంటీర్ చంద్రకళ


గంట్యాడ: వృద్ధుడు బంగారయ్యకు కేజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న పెదవేమలి వలంటీర్ సాగర్


జామి: ఆనందపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బంగారమ్మకు పింఛన్ అందజేస్తున్న భీమసింగి వలంటీర్ మణికంఠ, సచివాలయ కన్వీనర్ హరికృష్ణ


వేపాడ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పలనరసమ్మకు పింఛన్ అందజేస్తున్న ముకుందపురం వలంటీర్ పుష్ప

గంట్యాడ: పెదవేమలి గ్రామానికి చెందిన వృద్ధురాలు కళ్లపల్లి ఎల్లమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో విశాఖ పట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు సెప్టెంబర్ నెల వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ చంద్రకళ ఆదివారం కేజీహెచ్‌కు వెళ్లి అందజేశా రు. అలాగే అదే గ్రామానికి చెందిన వృద్ధుడు గొర్రు పోటు బంగారయ్య అనారోగ్యంతో ఆ హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్నాడు. అతనికి వలంటీర్ సాగర్ పింఛన్ డబ్బులు అందజేశారు.

వేపాడ: మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు గోకేడ అప్పల నరసమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమె విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ జలగడుగుల పుష్ప ఆదివారం కేజీహెచ్‌కు వెళ్లి ఆమెకు పింఛన్ డబ్బులు అందజేశారు. వలంటీర్‌ను సర్పంచ్ కనకరాజు అభినందించారు.

ఆనందపురం వెళ్లి..

జామి: భీమసింగి గ్రామానికి చెందిన ఆల్తి బంగారమ్మ అనారోగ్యంతో విశాఖపట్నం జిల్లా ఆనందపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ గ్రామ వలంటీర్ కోరాడ మణికంఠ, సచివాలయ కన్వీనర్ మజ్జి హరికృష్ణ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

6న బెస్ట్ శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

చీపురుపల్లి: శ్రీ కృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 6న బెస్ట్ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని, 5 ఏళ్ల లోపు పిల్లలకు జూనియర్స్ విభాగంలో, 6 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వయస్సు గల పిల్లలకు సీనియర్ విభాగంలో రాధా, కృష్ణుల వేషధారణ పోటీలు వేర్వేరుగా ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రెండు నుంచి మూడు నిమిషాలు నిడివిలో శ్రీ కృష్ణునికి సంబంధించిన కథ, శ్లోకం చెప్పాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9000108721, 8309974599, 9381722360 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దుకాణాలకు వేలం రేపు

చీపురుపల్లి: పట్టణంలోని సర్వే నంబర్ 45/1లో ఉన్న శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 16 బిట్లలో గల దుకాణాలు, ఖాళీ స్థలం నెలవారీ అద్దెల కోసం ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ బి.హెచ్.ఎస్.ఎన్.కిశోర్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం 10 గంటల కు దేవస్థానం కార్యాలయం వద్ద వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మూడేళ్ల కాలపరిమితిలో అద్దెలు చెల్లిస్తూ దుకాణాలు నిర్వహించుకునేందుకు, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

5న భగవద్గీత శ్లోక పఠన పోటీలు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని గీతామందిరంలో ఈనెల 5న భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించనున్నట్లు గీతా సత్సంగ్ సేవాశ్రమం ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ముందుగానే 9440105279, 7302760344 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజాసేవే మా అభిమతం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: ప్రజలకు సేవ చేయడమే తమ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఫూల్‌బాగ్ ప్రాంతంలోని హనుమాన్‌నగర్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. రూ. 57 లక్షలతో నిర్మించిన రహదారులు, కాలువలను ప్రారంభించి ప్రజావినియోగంలోకి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్న స్థానికులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజాసేవే పరమార్థంగా నగరంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయులని కొనియాడారు. అభివృద్ధి పనులు చేపట్టి, వాటిని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఒకటో డివిజన్ ప్రాంతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ప్రస్తుతం జరుగుతోందన్నారు. అందుకే ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు.

• తీరిన ఇక్కట్లు



బురదమయంగా చుక్కపేట రోడ్డు



ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

గుర్ల: మండలంలోని చుక్కపేట ప్రధాన వీధిలో మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం మీదుగా పోయే బీటీరోడ్డును అనుసంధానించే ఈ మట్టి రోడ్డులో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానా తిప్పలు పడాల్సి వచ్చేది. చిన్నపాటి వర్షానికే దారంతా బురదగా తయార్యేది. ద్విచక్ర వాహనచోదకులు బురదలో జారిపడే పోయేవారు. నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. స్థానికులు సమస్యను 'గడప గడప మన ప్రభుత్వం' కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివా సరావు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు సుమారు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యకు చెక్ చెప్పిన జెడ్పీ చైర్మన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మెగా వైద్యశిబిరం రేపు

- జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు, ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో ఏర్పాటు
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహణ


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని చెప్పారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. అలాగే అదే రోజు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, పనస అప్పారావు, మీసాల సీతారాం పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమ్మ పండగ


అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయానికి చేరుకున్న మహిళలు


అమ్మవారి ఉజిడి బండిని ఆలయానికి తీసుకువెళుతున్న భక్తులు

వేపాడ: మండలంలోని బల్లంకిలో గ్రామదేవత భూలోకమ్మ వారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ వరి నాట్లు అనంతరం అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామస్తులంతా అమ్మవారి ఉజిడి బండితో కలిసి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, ఉపసర్పంచ్ పల్లి ధనుంజయ, వార్డు మెంబర్లు, గ్రామపెద్దలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేద్దాం


ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈశ్వరరావు, తదితరులు

గజపతినగరం: ఎం.వెంకటాపురం గ్రామంలోని శ్రీకృష్ణాలయంలో ఈనెల 6వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించను న్నామని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆ గ్రామ ఎస్సీ కాలనీలో ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తేదీన స్వామివారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 7వ తేదీన స్వామి వారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందని, భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సాహంగా పాటల పోటీలు

విజయనగరం టౌన్: పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో డాక్టర్ అక్కెన బాల నాగ శ్రీకర్ ఆధ్వర్యంలో ట్రాక్ సినిమా పాటల పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఈ నెల 25న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకుడు ఎ.శ్రీరామ్మూర్తి తెలిపారు.

సుమారు 120 మంది గాయకులు పాల్గొనగా.. న్యాయ నిర్ణేతలుగా మూర్తి, పద్మనాభం వ్యవహరించారు.